# కుతుబ్ షాహీ వంశ పాలకులు

క్రీ.శ. 1347లో గుల్బర్గా కేంద్రంగా అల్లాఉద్దీన్ హసన్ గంగూ బహమని రాజ్యాన్ని స్థాపించారు. ఈ రాజ్యం క్రీ.శ.1500 ప్రాంతంలో అహ్మదాన్‌గర్, బీజాపూర్, బీరారు, బీదర్, గోల్కొండ అనే ఐదు స్వతంత్ర ముస్లిం రాజ్యాలుగా విడిపోయింది. అనేక మంది అభిప్రాయం ప్రకారం గోల్కొండ రాజధానిగా క్రీ.శ. 1518–1687 మధ్య ముఖ్యంగా తెలంగాణ, తీరాంధ్ర ప్రాంతాలను పాలించిన వంశస్థులే కుతుబ్‌షాహీలు. వీరు సుమారు 170 ఏళ్లు పాలించారు. క్రీ.శ. 1512 లో వీరు రాజ్యస్థాపన చేసినట్లు కొన్ని రచనల ద్వారా తెలుస్తున్నా... దీనిపై స్పష్టత లేదు.

కుతుబ్‌షాహీలు హందం వంశస్థులు. ఖరాఖయిన్ అనే తురుష్క తెగకు చెందినవారు. వీరి పూర్వీకులు టర్కిస్థాన్ ప్రాంత వాసులని తెలుస్తోంది. కుతుబ్‌షాహీ వంశ స్థాపకుడు సుల్తాన్ కులీ. ఈ వంశంలో గొప్పవాడు మహ్మద్ కులీ కుతుబ్ షా. చివరివాడు అబుల్ హసన్ తానీషా. వీరి రాజ్యం క్రీ.శ. 1687లో ఔరంగజేబు దాడుల వల్ల పతనమయింది. ఈ వంశంలో వరుసగా సుల్తాన్ కులీ, జంషీద్, సుభాన్‌కులీ, ఇబ్రహీం కులీ కుతుబ్‌షా, మహ్మద్ కులీ కుతుబ్‌షా, సుల్తాన్ మహ్మద్ కుతుబ్ షా, అబ్దుల్లా కుతుబ్ షా, అబుల్ హసన్ తానీషా రాజ్యాన్ని పాలించారు.

## సుల్తాన్ కులీ కుతుబ్ (క్రీ.శ. 1518–43)

ఈ వంశంలో మొదటివాడు సుల్తాన్ కులీ కుతుబ్. మొదట ఇతడు బహమనీ సుల్తాన్ మూడో మహ్మద్ షా అంగరక్షక దళంలో స్థానం సంపాదించాడు. తన ప్రతిభతో మహ్మద్ షా అభిమానానికి పాత్రుడై తెలంగాణ ప్రాంతానికి తరఫీదార్ (గవర్నర్)గా నియమితుడయ్యాడు. ఖవాస్‌ఖాన్ అన్న బిరుదు పొందాడు. దుర్భేద్యమైన గోల్కొండ కోటను నిర్మించి దాని చుట్టూ ఒక పట్టణాన్ని నిర్మించి దానికి ''మహ్మద్ నగర్'' అని పేరు పెట్టాడు. షియా మతాభిమాని అయినప్పటికీ హిందువులకు ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించాడు. ప్రజలు అభిమానంతో ఇతన్ని బడేమాలిక్ (దొడ్డ ప్రభువు) అని పిలిచేవారు. తన జీవితకాలంలో పలు యుద్ధాల ద్వారా 70 దుర్గాలను సాధించాడు. ఇతని కాలంనాటిదే హుస్నాబాద్ శాసనం, క్రీ.శ. 1518 నాటి జామె మసీదు శాసనం. ఇతనికి హైదర్ కులీ, కుతుబుద్దీన్, యార్‌కులీ (జంషీద్), అబ్దుల్ కరీం, దౌలత్ కులీ, ఇబ్రహీం కులీ కుమారులు. సుల్తాన్ కులీ క్రీ.శ. 1543 ప్రాంతంలో తన మూడో కుమారుడైన యార్‌కులీ (జంషీద్) హత్య చేయించాడు. యార్‌కులీ ప్రోద్బలంతో ఇతన్ని హత్య చేసిన వ్యక్తి ''మీర్ మహమద్ హందాని.''

## జంషీద్ కులీ (క్రీ.శ. 1543–1550)

ఇతడు పితృ హంతకుడు. పాలనకు వచ్చే నాటికి 60 సంవత్సరాల వృద్ధుడు. క్షయ, ఉబ్బసం వ్యాధులు ఇతనికి ఉన్నాయి. కోపంలో క్రూరత్వాన్ని ప్రదర్శించేవాడని ఫెరిస్టా రచనల వల్ల తెలుస్తుంది. ఇతనికి వ్యతిరేకంగా సోదరులైన దౌలత్ కులీ, ఇబ్రహీం కులీ కుట్ర పన్ని విఫలమయ్యారు. ఇబ్రహీం విజయనగరరాజ్యంలో తలదాచుకున్నాడు. ఇతనికి సదాశివరాయలు ఆశ్రయమిచ్చినట్లు తెలుస్తోంది.

## సుబాన్ కులీ (క్రీ.శ. 1550)

ఇతడు జంషీద్ కుమారుడు. తండ్రి మరణించేనాటికి రెండేళ్ల వాడని ఫెరిస్టా రచనలు తెలుపుతుండగా... ఇతర రచనలు అతని వయసు ఏడేళ్లుగా తెలుపుతున్నాయి. సుబాన్ పిన్న వయస్కుడు కావడం వల్ల రాణి బిల్‌ఖైస్ జమాన్ కోరిక మేరకు సయిఫ్ ఖాన్ పాలనా బాధ్యత నిర్వహించాడు. క్రమంగా సయిఫ్‌ఖాన్ బలోపేతుడవ్వడం సహించలేని అమీరులు ఇబ్రహీంను రాజ్యానికి ఆహ్వానించారు. ఇబ్రహీం జంషీద్ కుమారుడైన సుబాన్ కులీని హత్యచేయించి రాజ్యానికి వచ్చాడు.

## ఇబ్రహీం కుతుబ్ షా (క్రీ.శ. 1550–80)

సమర్థుడు, పరిపాలనాదక్షుడు. ఇతని పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ ఉండేదని పెరిస్టా రచనల వల్ల తెలుస్తోంది. ఖానెఆజం బిరుదాంకితుడైన ముస్తఫాఖాన్ ఇబ్రహీంకు ఆప్తునిగా, పీష్వాగా వ్యవహరించాడు. ఆహ్మద్‌నగర్ సుల్తాన్ హుసేన్ నిజాం షా తన కుమార్తె బీబీజమాల్‌ను ఇబ్రహీంకు ఇచ్చి వివాహం జరిపించినట్లు తెలుస్తుంది.

ఇబ్రహీం కుతుబ్ షా పాలన కాలంలోనే అహ్మదన్‌గర్ పాలకుడైన హుసేన్ నిజాం షా, బీజాపూర్ పాలకుడైన అలీ అదిల్షా, బీదర్ పాలకుడైన అలీ బరీద్ షా, గోల్కొండ పాలకుడైన ఇబ్రహీం కుతుబ్ షాలు ఒక సైనిక సమాఖ్యగా ఏర్పడి క్రీ.శ. 1565లో తళ్లికోట యుద్ధంలో విజయనగర పాలకులతో తలపడినట్లు తెలుస్తోంది. అహ్మద్‌నగర్‌తో ఉన్న వైరం కారణంగా బీరార్ వీరితో చేరలేదు. తళ్లికోట యుద్ధంలోనే హుసేన్ నిజాం షా చేతిలో రామరాయలు మరణించినట్లు తెలుస్తోంది. అళియరామరాయలు 'జగదేకరావు' అనే కుతుబ్ షాహీల సామంతుడిని ఇబ్రహీంకు వ్యతిరేకంగా ప్రోత్సహించాడు.

ఇబ్రహీం కుతుబ్ షా కాలంలో వేయించిన 10 శాసనాలు లభించాయి. వీటిలో కోయిలకొండ, పానుగల్లు, రాచకొండ, కొలలంపూడి, ఈపూరు, మల్కాపురం శాసనాలు సంస్కృతాంధ్ర భాషల్లోను ఇతన శాసనాలు పారశీక, అరబ్బీ భాషల్లోను వేయించినట్లు తెలుస్తుంది.

SAKSHI

ఇబ్రహీం కాలంలో గోల్కొండను బాగీరథీ నగరమని పిలిచేవారు.

ఇబ్రహీం కుతుబ్ షా పరమత సహనం గల వ్యక్తి. కవి పండిత పోషకుడు. ఆంధ్ర కవులను ఆదరాభిమానంతో పోషించినందువల్ల 'మల్కిభరాముడు'గా పేరుగాంచాడు. యయాతి చరిత్రను రాసిన పొన్నెగంటి తెలగనార్యుడు, తపతీ సంవరణోపాఖ్యానంను రాసిన అద్దంకి గంగాధరుడు, కందుకూరి రుద్రకవి ఇబ్రహీం ఆస్థానం వారే. హుస్సేన్‌సాగర్, ఇబ్రహీంపట్నం చెరువు, గోల్కొండ దుర్గం చుట్టు ప్రహరీగోడ, పూల్‌బాగ్ తోట, ఇబ్రహీం బాగ్, మూసీపై పురానాపూల్ ఇబ్రహీం కుతుబ్‌షా కాలం నాటివే. తెలుగు సాహితీ సంస్కృతులను ప్రోత్సహించిన మొదటి ముస్లిం పాలకుడు. ఇబ్రహీం ఆదరాభిమానాలను పొందిన కందుకూరి రుద్రకవి 'సుగ్రీవ విజయం' అనే యక్షగానాన్ని, నిరంకుశోపాఖ్యానం అనే కావ్యాన్ని రచించాడు. ఇబ్రహీం పరమత సహనం కలవాడని తెలుస్తున్నా అహోబిల దేవాలయంపై దాడిచేసి ధనరాశులను దోచుకోవడం ఇతని పరమత సహనానికి మచ్చగా చెప్పవచ్చు. కుతుబ్ షాహీ వంశస్థుల్లో మొదటిగా 'షా' బిరుదు వహించింది ఇబ్రహీం. ఇబ్రహీంకు అబ్దుల్ ఖాదర్, హుస్సేన్, మహ్మద్ కులీ కుతుబ్ షా, అబ్దుల్ ఫతా, ఖుదాబందా మీర్జా, మహ్మద్ అమీన్ అనే ఆరుగురు కుమారులు ఉన్నారు. ఏకైక కుమార్తె చాంద్ సుల్తానా. ఈమె బీజాపూర్ పాలకుడు రెండో ఇబ్రహీం ఆదిల్షా భార్య.

### ప్రాక్టీస్ ప్రశ్నలు...

**1. జహంగీర్ ఫర్మానాలలో కుమారునిగా సంబో . దించిన కుతుబ్ షాహీ పాలకుడు?**

ఎ) సుల్తాన్ కులీ  బి) మహ్మద్ కులీ కుతుబ్ షా
సి) మహ్మద్ కుతుబ్ షా  డి) తానీషా

**2. ''మల్కిభరాముడు''గా కీర్తి చెందింది?**

ఎ) సుల్తాన్ కులీ  బి) ఇబ్రహీం కులీ కుతుబ్ షా
సి) మహ్మద్ కులీ  డి) మహ్మద్ కుతుబ్ షా

**3. పద కవితా పితామహుడైన క్షేత్రయ్య ఇతని సత్కారాన్ని పొందాడు?**

ఎ) మహ్మద్ కులీ  బి) ఇబ్రహీం కులీ
సి) అబ్దుల్లా కుతుబ్ షా  డి) అబుల్ హసన్ తానీషా

**4. మహ్మద్ నగర నిర్మాత?**

ఎ) సుల్తాన్ కులీ  బి) మహ్మద్ కులీ
సి) ఇబ్రహీం కుతుబ్ షా  డి) అబ్దుల్లా కుతుబ్ షా

**5. కింది వారిలో క్రూరుడు, పితృ హంతకుడు?**

ఎ) జంషీద్  బి) ఇబ్రహీం కులీ
సి) అబ్దుల్లా కుతుబ్ షా  డి) సుబాన్ కులీ

| జవాబులు | 1 | 2 | 3 | 4 | 5 |
|---|---|---|---|---|---|
| | C | B | C | A | A |

SAKSHI

## మహ్మద్ కులీ కుతుబ్ షా (క్రీ.శ. 1626-62)

ఇతను ఇబ్రహీం కుతుబ్ షా మూడో కుమారుడు. కుతుబ్‌షాహీ పాలకుల్లో గొప్పవాడు. ఇతని కాలంలోనే కుతుబ్ షాహీల ఆధిపత్యం యావత్ ఆంధ్రదేశంపై నెలకొంది. ఇతడు పర్షియా చక్రవర్తి షా అబ్బాస్‌తో స్నేహ సంబంధాలు నెలకొల్పుకొని ఆ ప్రాంతం నుంచి నిపుణులను రప్పించి వర్తక వ్యాపారాల అభివృద్ధికి కృషి చేశాడు. గోల్కొండ రాజ్యంలోకి యూరప్ వర్తకుల ప్రవేశం ఇతని కాలంలోనే ప్రారంభమైంది. బ్రిటిష్ నౌక 'గ్లోబ్' క్రీ.శ. 1611లో మచిలీపట్నం చేరుకుంది. అదే ఏడాది వర్తక కేంద్రం ఏర్పాటుకు (మచిలీపట్నంలో) ఈస్టిండియా కంపెనీకి అనుమతించాడు. హైదరాబాద్ నిర్మాత ఇతడే. కులీ కుతుబ్ షా తన ప్రేయసి భాగమతి(భాగ్యమతి) పేరు మీద నిర్మించిన భాగ్యనగరమే నేటి హైదరాబాద్ అనే అభిప్రాయం ఉంది. హైదరాబాద్‌లోని చార్మినార్, జామా మసీదు, చందన్‌మహల్‌లు ఇతని కాలంలో నిర్మించినవే.

మహ్మద్ కులీ స్వయంగా కవి. 'దక్కని ఉర్దూ'లో ఎన్నో గేయాలను రచించారు. గొప్ప పండితుడు, తత్వవేత్త అయిన 'మీర్‌మోమిన్ అస్త్రబాది' ఇతని ఆస్థానంలో ఉండేవాడు. శివధర్మోత్తరం, పద్మ పురాణం వంటి గ్రంథాలను రాసిన రామిరెడ్డి, వైజయంతి విలాసం కావ్యాన్ని రాసిన సారంగు తిమ్మయ్య, సోమయాజీ, గణేష్ పండిట్ వంటి ప్రముఖ కవులు మహ్మద్ కులీ ఆదరాభిమానాలు పొందినవారే.

మహ్మద్ కులీ కలం పేరు 'మాని'. ఇతని కాలంలోనే కుతుబ్‌షాహీల రాజధానిని గోల్కొండ నుంచి హైదరాబాద్‌కు మార్చారు. 'లైలామజ్ను' అనే కావ్యాన్ని రాసిన మీర్జా మహ్మద్ అమీన్ మహ్మద్ కులీ కాలానికి చెందినట్టు తెలుస్తోంది. 'కులియాతోకులీ'గా మహ్మద్ కులీ ప్రసిద్ధి చెందాడు.

## మహ్మద్ కుతుబ్ షా (1612-26)

ఈయన మహ్మద్ కులీ సోదరుని కుమారుడు. శాంతిప్రియుడు మక్కా మసీదు నిర్మాణానికి పునాది వేశాడు. స్వయంగా కవి అయిన ఆయన 'జల్-ఉల్-లాహ్' అనే కలం పేరుతో ఎన్నో గజల్లను రాసినట్టు తెలుస్తోంది. ఇతని రాణి హయత్‌బక్షీ బేగం రాజ్యంలో విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. మొఘల్ చక్రవర్తి జహంగీర్ తను జారీ చేసిన ఫర్మానాలో మహ్మద్ కుతుబ్ షాను కుమారునిగా సంబోధించినట్టు తెలుస్తోంది. మహ్మద్ కుతుబ్ షా కాలంలోనే ఖైరతాబాద్ మసీదు నిర్మించారని చెబుతారు. ఇతని కాలంలోనే ప్రముఖ వైద్యుడు హకీంతకిముద్దీన్ 'మిజామత్ తబాయీ కుతుబ్ షాహీ' గ్రంథం రచించాడు. పారశీక భాషలో గ్రంథ రచనను ప్రోత్సహించిన ఘనత మహ్మద్ కుతుబ్ షాదే.

## అబ్దుల్లా కుతుబ్ షా (క్రీ.శ. 1626-72)

మహ్మద్ కుతుబ్ షా పెద్ద కుమారుడు. కుతుబ్ షాహీల్లో అత్యధిక కాలం పాలించింది ఇతడే. ఈయన హయాంలోనే గోల్కొండ రాజ్య పతనం ప్రారంభమైందని చెప్పవచ్చు. సింహాసనం అధిష్టించే నాటికి 12 ఏళ్లు. తల్లి హయత్‌బక్షి బేగం సంరక్షకురాలిగా పాలన సాగించింది.

అబ్దుల్లా కుతుబ్ షా 1636లో షాజహాన్‌తో సంధి చేసుకొని మొఘల్ చక్రవర్తులకు సామంతుడిగా మారాడు. ఇతని కాలంలో డచ్ వారు శాంధోమ్‌ను ఆక్రమించారు. ఈస్టిండియా కంపెనీకి తీరాంధ్ర ప్రాంతంలో వ్యాపారానికి సంబంధించి కొన్ని ప్రత్యేక హక్కులనిస్తూ క్రీ.శ. 1634లో సువర్ణ ఫర్మానాను జారీ చేశాడు. దక్కన్‌లో మొఘల్ వైస్రాయ్‌గా ఉన్న ఔరంగజేబు క్రీ.శ. 1655లో గోల్కొండపై దండెత్తినప్పుడు ఈయన నష్టపరిహారంగా పెద్ద మొత్తంలో ధనాన్ని చెల్లించాడు. మొఘల్ సార్వభౌమాధికారాన్ని అంగీకరించిన మొదటి కుతుబ్ షాహీ పాలకుడు ఈయనే. ఇతని కాలంలో కూచిపూడి నృత్యం ఆదరణ పొందింది. న్యాయానికి పెట్టింది పేరు అబ్దుల్లా కుతుబ్ షా అని కొన్ని రచనలు తెలుపుతున్నాయి. ప్రముఖ ఉర్దూ కవి గవాని అబ్దుల్లా కుతుబ్ షా ఈ కాలంవాడే. ఇతని మంత్రి, సైన్యాధ్యక్షుడు మీర్‌జుమ్లా.

## అబుల్ హసన్ తానీషా (క్రీ.శ. 1672-87)

కుతుబ్ షాహీ వంశంలో చివరి పాలకుడు. ఉదార స్వభావుడైన ఇతన్ని ప్రజలు 'తానీషా' అని కీర్తించారు. ఇతని కాలంలోనే శివాజీ హైదరాబాద్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది. మాదన్న, అక్కన్నలు ఇతని కొలువులో ప్రధాని, సైన్యాధ్యక్షుడిగా పని చేశారు. వీరి మేనల్లుడే కంచర్ల గోపన్న. భద్రాచలం రెవెన్యూ అధికారిగా పనిచేసిన గోపన్న భద్రాచలంలో శ్రీరామచంద్రుడి ఆలయాన్ని నిర్మించాడు. గోపన్న 'రామదాసు'గా ప్రసిద్ధి. క్రీ.శ. 1685 ప్రాంతంలో జరిగిన మొఘలుల దాడిలో ఓటమిపాలైన తానీషా వారితో సంధి చేసుకున్నాడు. ముస్లిం సర్దారుల కుట్రవల్ల 1686 మార్చి 24న అక్కన్న, మాదన్నల హత్యతో గోల్కొండ రాజ్యం బలహీనమైంది. క్రీ.శ. 1687 ఫిబ్రవరిలో ఔరంగజేబు స్వయంగా గోల్కొండపై దండెత్తాడు. ఈ సమయంలో మొఘల్ సేనలను ఎదుర్కొని ఏడు నెలలపాటు కోటను కాపాడి, చివరకు విఫలుడైన యోధుడు అబ్దుల్ రజాక్ లారి. గోల్కొండ కోట తలుపులు తెరవడానికి ఔరంగజేబుకు సహకరించిన ఉద్యోగి, రాజద్రోహి 'అబ్దుల్లాపని'. మొఘల్ సేనలకు బంధీగా చిక్కిన అబుల్ హసన్‌ను దౌలతాబాద్ కోటలో బంధించారు. అక్కడే మరణించాడు.

## కుతుబ్ షాహీ యుగ విశేషాలు

కుతుబ్ షాహీల రాజ్యాన్ని సుబాలు, సర్కార్‌లు, పరగణాలుగా

SAKSHI

విభజించారు. తానీషా కాలం నాటికి వీరి రాజ్యం ఆరు సుబాలు, 37 సర్కార్లు, 517 పరగణాలుగా విభజించినట్లు చెప్పవచ్చు. కర్ణాటక సుబా పెద్దది. సుబాకు అధిపతి సుబేదార్ లేదా తరఫేదారు. సర్కార్‌కు అధిపతి ఫౌజ్‌దార్, పరగణా అధిపతి తహసీల్దార్. గ్రామాల్లో మీరాశీ హక్కు (వంశపారంపర్య) హక్కు కలిగిన 12 మంది ఆయగార్లు ఉండేవారు. వారు 'బలుతియాన్' అని పేరు పొందారు.

పాలనా వ్యవహారాల్లో సుల్తాన్ తర్వాత పీష్వా (ప్రధాని) ముఖ్యుడు. పీష్వా నేతృత్వంలో 12 మంది వజీర్లు(మంత్రులు) ఉండేవారు. ఆర్థిక మంత్రిని మీర్‌జుమ్లా, యుద్ధ మంత్రిని ఐనుల్ ముల్క్ అని వ్యవహరించేవారు. శాంతి భద్రతల నిర్వహణ బాధ్యత 'కొత్వాల్'ది. సర్వోన్నత న్యాయాధిపతి సుల్తాన్. అతని తర్వాత స్థానం 'షరియత్ పంచ్'ది. ప్రజల్లో నైతిక విలువలను ప్రచారం చేసేందుకు 'మహత్‌సిబ్'లనే ప్రత్యేక అధికారులుండేవారు. రాజులు షియా మతాభిమానులైన పరమత సహనంతో వ్యవహరించారు. వీరిది పితృస్వామిక సమాజం. కుతుబ్ షాహీల కాలంలో ఉర్దూ, తెలుగు భాషల్లో సాహిత్య సేవ జరిగింది. పద కవితా పితామహుడైన క్షేత్రయ్యను అబ్దుల్లా కుతుబ్ షా ఘనంగా సత్కరించినట్లు తెలుస్తుంది. దాశరథి శతకం, రామదాసు కీర్తనలను రాసిన ఘనత కంచర్ల గోపన్నది. ఈ యుగంలోనే ఫిరోజ్ తెసల్‌నామా అనే గ్రంథాన్ని గవాసి తూత్‌నామాను, ఇబ్నెనిషాతి ఫూల్‌బన్‌ను రాసినట్లు తెలుస్తుంది. ఖాదిర్‌ఖాన్ రాసిన కుతుబ్‌షాహీ చరిత్ర. ఫెరిస్టా రాసిన గుల్షనీ ఇబ్రహిమి వంటి గ్రంథాలు వీరి చరిత్రను తెలుసుకోవడానికి కొంత ఉపకరిస్తున్నాయి. అబ్దుల్లా కుతుబ్ షా కాలంలో ప్రముఖ పాత్ర వహించిన మీర్‌జుమ్లా కోహినూరు వజ్రాన్ని షాజహాన్‌కు అందజేసినట్లు తెలుస్తోంది. వీరి కాలంలో వరంగల్ వస్త్ర పరిశ్రమకు, మచిలీపట్నం కలంకారీ పరిశ్రమకు ప్రసిద్ధిగాంచింది. వజ్ర పరిశ్రమ అభివృద్ధి చెందింది.

## ప్రాక్టీస్ బిట్స్

**1. గోల్కొండ రాజ్యం పతనమైన సంవత్సరం?**

ఎ) క్రీ.శ. 1518 బి) క్రీ.శ. 1655
సి) క్రీ.శ. 1687 డి) క్రీ.శ. 1787

**2. మొఘలుల దాడి నుంచి గోల్కొండ కోటను కాపాడటానికి శతవిధాల ప్రయత్నించిన యోధుడు?**

ఎ) అబ్దుల్లాపని బి) అబ్దుల్ రజాక్ లారి
సి) ఫెరిస్టా డి) గవాసి

**3. 'జల్-ఉల్-లాహ్' ఇతని కలం పేరు?**

ఎ) ఇబ్రహీం కుతుబ్ షా బి) మహ్మద్ కులీ
సి) మహ్మద్ కుతుబ్ షా డి) తానీషా

**4. మొఘల్ సార్వభౌమాధికారాన్ని అంగీకరించిన మొదటి కుతుబ్ షాహీ పాలకుడు?**

ఎ) మహ్మద్ కులీ కుతుబ్ షా బి) మహ్మద్ కుతుబ్ షా
సి) అబ్దుల్లా కుతుబ్ షా డి) అబుల్ హసన్ తానీషా

## సమాధానాలు

1. సి 2. బి 3. సి 4. సి

SAKSHI